క్లుప్తంగా

ఘనంగా వృక్ష పూజ

ఉప్పలగుప్తం: విలసవిల్లి రామ మందిరంలో నవ గ్రహ నక్షత్ర పూర్వక మహా సౌరయాగ అష్టమ వార్షికోత్సవంలో 27వ రోజు వృక్ష పూజ ఘనంగా నిర్వహించారు. పూర్వాషాడ నక్షత్ర జాతకులతో నిమ్మవృక్షానికి ప్రత్యేక పూజలు చేయించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

అల్లవరం: గోడిలోని బీఆర్ అంబేడ్కర్ బాలురు గురుకులంలో పది, ఇంటర్మీడియట్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరీక్షలకు అవసరమైన కిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధ్యక్షుడు బత్తుల నకులరాజు, మండల అధ్యక్షులు ఉప్పే నరసింహరావు, ప్రధాన కార్యదర్శి జనుపెల్ల లోవరాజు, ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఏర్పాట్లు

అల్లవరం: గోడిలో ఉన్న ఆనంద బాలయోగీశ్వర స్వామివారి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆశ్రమ కమిటీ అధ్యక్షుడు తోట నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ నెల 26న మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆనంద బాలయోగీశ్వర స్వామివారి దివ్య దర్శనం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, తీర్థ మహోత్సవాలు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. బాలయోగీశ్వర్లు తపస్సు చేసిన దేవుడు మాన్యంలో జరుగుతున్న మహా శివరాత్రి ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై ఆనంద బాలయోగీశ్వర్లుని దర్శించుకుంటున్నారన్నారు.

డ్రగ్ ట్రేడ్ యూనియర్ జిల్లా జాయింట్ సెక్రటరీగా మోకా

అమలాపురం టౌన్: జిల్లా డ్రగ్ ట్రేడ్ యూనియర్ జాయింట్ సెక్రటరీగా అమలాపురానికి చెందిన మోకా వెంకట సుబ్బారావు నియమితులయ్యారు అమలాపురంలో సాయినాథ్ మెడికల్ అండ్ జనరల్ ఏజెన్సీస్ నిర్వహిస్తున్న వెంకట సుబ్బారావు పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడిగా, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. రాజమహేంద్రవరంలో జరిగిన డ్రగ్ ట్రేడ్ యూనియన్ సమావేశం వెంకట సుబ్బారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వెంకట సుబ్బారావును జిల్లా యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాసరావుతోపాటు పలువురు మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్, మెడికల్ వ్యాపారులు అభినందించారు.

జ్ఞానజ్యోతి శిక్షణ పరిశీలన



పాఠశాలలో సిబ్బందికి బ్రోచర్లను అందిస్తున్న సీడీపీవో విజయశ్రీ, ఎంఈవో సత్యకృష్ణ

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ సిబ్బందికి జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణను సీడీపీవో విజయశ్రీ, విద్యాశాఖ ఏఎంవో పి.రాంబాబు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు 3 నుంచి 6ఏళ్ల వయస్సులో ఏ విషయమైన అవగాహన చేసుకునే సామర్థ్యం ఉంటుందని సిబ్బంది వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సిబ్బందికి శిక్షణా బ్రోచర్లను అందించారు. కార్యక్రమంలో ఎంఈవో సత్తి సత్యకృష్ణ, హెచ్ఎం ఎల్.రాణి, డీఆర్‌పీలు నూకల బుషేంద్ర, బీఎస్ఆర్ఎలెస్ మూర్తి, జె.రాజేష్, అన్నపూర్ణ, లీలాకుమారి పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లకు సత్కారం



ఆర్టీసీ డ్రైవర్లను సత్కరిస్తున్న జిల్లా రవాణా అధికారి శ్రీనివాసరావు, డీఎం సత్యనారాయణమూర్తి

అమలాపురం రూరల్: ఆర్టీసీ అమలాపురం డిపో నుంచిడి కుంభమేళా యాత్రకు వెళ్లి వచ్చిన 12 మంది ఆర్టీసీ డ్రైవర్లను జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు సత్కరించారు. సోమవారం అమలాపురం డిపో ఆవరణలో జరిగిన కార్యక్రమంలో డీటీఓ దేవిశెట్టి శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ నెల 12వ తేదీన ఆర్టీసీ అమలాపురం డిపో నుంచి ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న కుంభమేళా యాత్రకు ఆరు బస్సులను డీటీఓ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆ సర్వీసుల్లో వెళ్లిన 220 మంది ప్రయాణికులను సురక్షితంగా తిరిగి తీసుకొచ్చిన డ్రైవర్లను సత్కరించారు. డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ ఇంజినీర్ గంగుమళ్ల రమా లక్ష్మీదేవి, అసిస్టెంట్ మేనేజర్ ప్రతిమ కుమారి, ఏపీఆర్ ఎస్ ఇన్‌చార్జి ఎస్.వరహాల బాబు తదితరులు పాల్గొన్నారు.

మార్చి రెండో వారంలో అసెంబ్లీ సమావేశాలు

యానాం: పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశాలు మార్చి రెండో వారంలో ప్రారంభమవుతాయని స్పీకర్ ఆర్ సెల్వం తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆ సమావేశాల్లో పుదుచ్చేరి ఆర్థిక నివేదికను సభలో ప్రవేశపెడతారన్నారు. ఇప్పటికే రూ.600 కోట్లను నూతన అసెంబ్లీ భవన నిర్మాణానికి కేటాయించాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. అయితే కేంద్రం రెండు వాయిదాలుగా రూ.500 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించిందన్నారు. ఈనెల 26న న్యూఢిల్లీలో కన్సల్టేటివ్ మీటింగ్ జరుగుతుందని, దానిలో సీనియర్ అధికారులు, పుదుచ్చేరి ప్రధాన కార్యదర్శి సైతం పాల్గొంటారన్నారు.

బీడువారుతున్న భూములు

- సాగునీరు అందక రైతుల ఇక్కట్లు
- వంతుల వారీగా కాలువలకు నీరు
- లేని చోట ఇంజన్లే దిక్కు
- ఆందోళనలో అన్నదాత



కందికుప్పలో సాగు నీరు అందక చవుడు బారుతున్న వరిచేలు

కాట్రేనికోన: శివారు గ్రామాలకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వంతుల వారీగా అందిస్తున్న నీరు సక్రమంగా అందక పంట పొలాలు బీటలు వారుతున్నాయి. మండలంలో సుమారు 8,100 ఎకరాలు వరి చేలకు 7,300 ఎకరాలలో నాట్లు వేశారు. బొబ్బర్లంక-పల్లంకుర్రు ప్రధాన పంట కాలువ కుండలేశ్వరం వైరు లాకు దిగువ, ఎగువ ప్రాంతాల్లో సాగు చేస్తున్న రైతులకు అవసరమైన సాగు నీటిని వంతుల వారీ పద్ధతుల్లో ఇరిగేషన్ అధికారులు సరఫరా చేస్తున్నారు. అయితే శివారు ప్రాంతాలు ఈసాగునీరు అందక చేలు బీటలు వారుతున్నాయి. మండలంలో పల్లంకుర్రు-2 లాగు నుంచి బలుసుతిప్ప వెళ్లే కాలువ వెంబడి ఉన్న మొక్కల తిప్ప, బూలవారి మొండి, రామాలయం పేట, సాపేవారిపేట, పల్లంకుర్రు-1 కాలువ వెంబడి చింతలచెరువు, లైనుపేట, కొత్త కాలువ మీదుగా ఐ.చెరువు వెళ్లే పంట చేలకు సాగు నీరు ఎద్దడి అధికంగా ఉంది. కందికుప్ప పంట కాలువ వెంబడి శివారు ప్రాంత రైతులకు చుక్క నీరు అందడం లేదు. పంట కాలువలో సాగు నీరు లేకపోవడంతో రైతులు కాలువకు అడ్డుకట్టలు వేసుకుని రాత్రి పగలు తేడా లేకుండా కష్టపడి నీరు పెట్టుకుని పంటను రక్షించుకుంటున్నారు.

భారమైనా..

నాట్లు ఎండిపోవడంతో తట్టుకోక రైతులు అధిక భారం అయినప్పటికీ పంటను రక్షించుకోనేందుకు ఇంజన్లను ఆశ్రయిస్తున్నారు. సాగు నీటి కోసం పల్లంకుర్రు ప్రధాన పంట కాలువలో నీటి ఇంజన్లు పెట్టుకుని తోడు కుంటున్నారు. ఇంజన్లతో తోడాల్సిన వస్తున్నందున్న రైతులకు అదనపు భారంగా మారింది.



పల్లంకుర్రులో సాగు నీటిని ఇంజన్లతో తోడుకుంటున్న రైతులు

నీరు లేక చేపల మృత్యువాత

మత్స్యపరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది రైతులు చేపలు, రొయ్యలు సాగు చేస్తున్నారు. పల్లంకుర్రు, కందికుప్ప, పల్లం, పంట కాలువలు వెంబడి శివారు ప్రాంతాలలో ఉన్న చేపలు, రొయ్యలు చెరువులకు సాగునీరు అందక మృత్యువాత పడుతున్నాయి. ఎండలు తీవ్రత అధికం కావడం, నీరు లోతు తగ్గిపోవడంతో రైతులు అధికంగా నష్టపోతున్నారు. రాష్ట్రానికి వ్యవసాయం తరువాత అధిక శాతం ఆక్వా రైతులు, నిరుద్యోగులు, అనేక పరిశ్రమలు మత్స్య పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నాయి. శివారు ప్రాంత చేపల రైతులకు సాగునీరు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

నీరందక ఇబ్బంది



సాగునీరు అందక చేలు చౌడు బారుతున్నాయి. దీంతో ఆందోళన చెందుతున్నాం. పంట కాలువలో గట్టు వేసుకుని నీటిని కట్టినా నీరు ఎక్కడం లేదు. పంట కాలువకు నీరు సక్రమంగా అందించాలి.

– నీలం అప్పారావు, కందికుప్ప

ఉన్నతాధికారులు దృష్టికి తీసువెళ్లాం

వంతుల వారీగా కుండలేశ్వరం ఎగువ, దిగువ ఆయకట్టుకు 11 రోజులకు ఒకసారి చొప్పున 4 రోజులు మాత్రమే వస్తోంది. ఏడు రోజులు ఇస్తే పంట చేలకు సాగునీటి ఎద్దడి ఉండేది కాదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాం.

– పవన్ కుమార్, ఏఈఈ, ఇరిగేషన్

విద్యార్థులకు అభినందనలు

అమలాపురం రూరల్: జాతీయ స్థాయిలో మల్టీపర్పస్ సైక్లింగ్ మిల్లర్ ప్రాజెక్టు తయారీ చేసి ద్వితీయ స్థానం సాధించిన వన్నెచింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.రోహిణి, ఎస్.శశివదనలను వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాసరావు సోమవారం సన్మానించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయిని విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాన్ని కొనియాడారు. అదేవిధంగా గైడ్ చేసిన ప్రధానోపాధ్యాయులు జి.నాగ సత్యనారాయణ, ప్రాజెక్ట్ టీచర్ ప్రకాష్‌లను అభినందించారు.

డ్రైవర్ సస్పెన్షన్ రద్దు చేయాలని రిలే నిరాహార దీక్ష

అమలాపురం రూరల్: స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్ బీఎస్ నారాయణ అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేయాలని నేషనల్ మజ్దూర్ యూనియన్‌ఆధ్వర్యంలో ఉద్యోగులు సోమవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. డ్రైవర్ నారాయణపై సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు. ఈనెల 10వ తేదీన అమలాపురం డిపో నుంచి విజయవాడకు వెళుతుండగా హనుమాన్ జంక్షన్ వద్ద అధికారుల తనిఖీల్లో డ్రైవర్ బీఎస్ నారాయణపై వేటు వేశారని, ఫైర్ కలెక్టర్ టికెట్ నాట్ గివెన్ రూల్ ప్రకారం వేటు వేసినట్టు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి టికెట్ ధర కంటే పది రెట్లు వసూలు చేసి శిక్షించే అవకాశమున్న అధికారులు అన్యాయంగా డ్రైవర్‌ను సస్పెండ్ చేశారని అన్నారు. డ్రైవర్ నేషనల్ మద్దూర్ యూనియన్ అసోసియేషన్ నాయకులు ఆరోపిస్తున్నారు.

జాతీయ స్థాయిలో లయన్స్‌క్లబ్ సేవలు



తాళ్లరేవు కార్యక్రమంలో మాట్లాడుతున్న డీవీఎస్ రాజు

తాళ్లరేవు: లయన్స్‌క్లబ్‌ల ద్వారా గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు అద్భుత సేవా కార్యక్రమాలు చేస్తూ పలువురి జీవితాల్లో వెలుగులు నింపుతున్నట్టు లయన్స్‌క్లబ్ మల్టిపుల్ జీఎల్‌టీ కోఆర్డినేటర్ డీవీఎస్ రాజు(రమేష్) తెలిపారు. ఆదివారం రాత్రి స్థానిక సూర్య భాస్కర కల్యాణ మండపంలో కాకినాడ జిల్లా లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ లయన్ బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో రీజనల్ కాన్ఫరెన్స్ జలావణ్య శ్రీనివాసం కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఉన్నతమైన లక్ష్యంతో పని చేస్తూ లయన్స్ సభ్యులు సమాజంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారన్నారు. సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సేవా కార్యక్రమాలను రూపొందించాలని పిలుపునిచ్చారు. యువత లయన్స్‌క్లబ్‌లోకి రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి రీజియన్ పరిధిలోని క్లబ్‌లలో చేసిన సేవా కార్యక్రమాలను వివరించారు. శ్రీనివాసరెడ్డి, లావణ్య దంపతులను లయన్స్ ప్రతినిధులు దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేసారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు వైఎస్ఆర్ శర్మ, దాసరి తిరుమలరావు, లింగమల్లు కృష్ణమూర్తి, శేషుఅనిల్ కుమార్, ముంజులూరి విశ్వేశ్వరరావు, చిట్నీడి శ్రీనివాస్, వజ్రపు కోటేశ్వరరావు, వేలూరి సూర్య నారాయణ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా కొప్పిశెట్టి లక్ష్మయ్య అభాగ్యుల బ్రహ్మోర్బన్ పథకానికి డాక్టర్ బాదం బాలకృష్ణ రూ.50 వేలు విరాళం అందజేశారు. అనంతరం రీజియన్‌లో ఉత్తమ సేవలు అందించిన క్లబ్‌లకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ధూళిపూడి వెంకటరమణ, నడింపల్లి వినోద్, చోడే శ్రీనివాస్, నున్న దత్తు, పొన్నాడ పేరయ్యరాజు, సతీష్‌రాజు, మాలతీ వసుంధర తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుని తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు రమణారావు

ఉప్పలగుప్తం: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో చల్లపల్లి పంచాయతీ పర్రెపేటకు చెందిన యువకుడు కుంచే అనిల్‌కుమార్ తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ అధినేత కుంచే రమణారావు సోమవారం పరామర్శించారు. ఈ సంధర్భంగా మృతుని తల్లిదండ్రులు అన్నవరం, పల్లంరాజులను రమణారావు ఓదార్చి, వారికి ధైర్యం చెప్పి, ఆర్థిక సాయంగా రూ.25 వేలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కుంచే సత్యనారాయణ, అర్జునరావు, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు, నాయకులు నేలపూడి సుగంధకుమార్, పందిరి సుబ్బరాజు, గంటా లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం జీవనజ్యోతి బీమా చెక్కు అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు బీమా చెక్కు అందజేస్తున్న బ్రాంచి మేనేజర్ శ్రీధర్ తదితరులు

ముమ్మిడివరం: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముమ్మిడివరం బ్రాంచి ఖాతదారుడైన తానేల్లంక గ్రామానికి చెందిన పాలెపు గంగరాజు ఇటీవల మృతి చెందడంతో అతనికి ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజనన పథకంలో రూ.2లక్షలు పరిహారం మంజూరైంది. ఈ మొత్తాన్ని బ్రాంచి మేనేజర్ వైఎల్ శ్రీధర్ సోమవారం నామినిగా ఉన్న మృతిని భార్య విజయలక్ష్మికి అందజేశారు. ఈసందర్భంగా మేనేజర్ శ్రీధర్ విలేకరులతో మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడు ఇన్సురెన్స్ నామమాత్రపు ప్రీమియం చెల్లించి ఆ కుటుంబంలో మృతి చెందిన వ్యక్తులపై ఆధార పడిన వారికి రూ.2లక్షలు వరకు పరిహారం పొందే అవకాశాలున్నాయన్నారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజనవ పథకంలో రూ.2వేలు ప్రీమియంతో రూ.40ల క్షల వరకు ప్రీమియం పొందే అవకాశముందని తెలిపారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కేవలం నామమాత్రపు రుసుం రూ.436 సంవత్సరానికి చెల్లిస్తే కుటుంబంలో వారు మృతి చెందితే నామినీకి రూ.రెండు లక్షలు పరిహారం అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్వీస్ మేనేజర్ టి.రాజశేఖర్ పాల్గొన్నారు.

మానవత్వం చాటారు

అమలాపురం టౌన్: స్థానిక సూర్యనగర్‌లో కాలు విరిగి లేవ లేని స్థితిలో ఉన్న ఆబోతుకు స్థానికులు సోమవారం వైద్యం చేయించి తమ వంతు మానవత్వాన్ని చాటారు. వైద్యం చేశాక కొంత కోలుకున్న ఆంబోతు కొద్దిగా నడవడం మొదలుపెట్టడంతో వారంతా సంతృప్తి వ్యక్తం చేశారు. సూర్యనగర్‌కు చెందిన విత్తనాల శ్రీను, రెడ్డి తేజ, వెంకటేశ్వరరావు ఆబోతుకు చికిత్స చేసిన వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

ముమ్మిడివరం: రోడ్డు దాటుతున్న మహిళను స్కూటీపై వెళుతున్న ఇద్దరు యువతులు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. ముమ్మిడివరం మండలం అనాతవరం కై రం వారి వీధికి చెందిన పేరూరి శ్రీమహాలక్ష్మి, తన తోటి కోడలు లక్ష్మితో కలిసి కొమరగిరి శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తూ అనాతవరంలో రోడ్డు దాటుతుండగా అటుగా వెళుతున్న మెడికల్ కళాశాల విద్యార్థినులు స్కూటీతో ఢీకొట్టడంతో శ్రీమహాలక్ష్మి తీవ్రంగా గాయపడింది. ఆమెను అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రణాళికతో చదివితేనే ఉత్తమ ఫలితాలు



కోనసీమ సైన్స్ పరిషత్ మహాసభలో మాట్లాడుతున్న సర్వేశ్వరశర్మ

అమలాపురం టౌన్: ప్రణాళిక బద్ధమైన చదువే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ అన్నారు. స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం సాయంత్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కోనసీమ సైన్స్ పరిషత్ 2904వ మహాసభలో డాక్టర్ శర్మ మాట్లాడారు. విద్యార్థులు ఏ పాఠ్యాంశమైనా ఇష్టపడుతూ కష్ట పడుతూ చదవినప్పుడే అది మెదుడులో నిక్షిప్తమై పరీక్షల్లో రాసే సత్తా సొంతం అవుతుందన్నారు. ముఖ్యంగా సైన్స్‌లో వంద శాతం మార్కులు తెచ్చుకునేందుకు జవాబులు ఏ రీతిలో రాయాలో ప్రశ్నా పత్రాన్ని విశ్లేషిస్తూ విద్యార్థులకు పలు చిట్కాలు వివరించారు. సభకు మరో అతిథిగా విచ్చేసిన డీవైఈవో గుబ్బల సూర్య ప్రకాశం మాట్లాడుతూ విద్యార్థి ప్రతిభకు మార్కులే కొలమానమని పేర్కొన్నారు. మహాసభకు అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీఆర్ కామేశ్వరరావు మాట్లాడుతూ అనుభవజ్ఞులైన విద్యావేత్తలు విద్యార్థులకు పరీక్షల్లో నెగ్గే దిశగా చేసే సూచనలు, సలహాలను విధిగా పాటించాలన్నారు.

వేగవంతంగా వెంకన్న ఆలయ నిర్మాణం



ఆలయ నిర్మాణ వెల్లడిస్తున్న మల్లాడి

యానాం: స్థానిక భూసమేత వేంకటేశ్వరస్వామి నూతన ఆలయం పనులు శరవేగంగా జరుగుతున్నాయని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. సోమవారం ఆయన ఆలయ నిర్మాణానికి సంబంధించిన వివరాలు విలేకరులకు తెలిపారు. ఆలయ నిర్మాణం రెండు ఫేజ్‌లుగా జరుగుతుందని ఆవిధంగా యానాం, పరిసర ప్రాంతాల దాతలు అందించిన రూ.2.71కోట్లను టీటీడీ దేవస్థానం సూచన మేరకు అప్పట్లో టీటీడీకి డిపాజిట్ చేయగా నిర్మాణం టెండర్ కాంట్రాక్టరును ఎంపిక చేసి 2023 జూన్ 6 నుంచి పనులు ప్రారంభించారని ఆవిధంగా తిరుచునాపల్లిలో ఆలయ నిర్మాణ రాళ్లను చెక్కి ఆరాళ్లను యానాంకు తరలించారన్నారు. గత ఏడాది ఆగస్టు నుంచి ఆలయ నిర్మాణం, గాలిగోపురం, ధ్వజ స్తంభం, ఫ్లోరింగ్, అమ్మవారి ఆలయ పనులు మొదటి విడత పూర్తవుతాయన్నారు. రెండోవ విడతగా రాతితో కల్యాణ మండపం, వాహనశాల, అలంకార మండపం, స్ట్రాంగ్‌రూమ్, ఆలయం చుట్టూ 8 అడుగుల ఎత్తులో రాతితో చెక్కిన శిల్పాల పనులు, మున్సిపాలిటీ నుంచి తాను కొనుగోలు చేసి ఇచ్చిన ఉత్తర భాగాన స్థలంలో పనులు సైతం ప్రారంభమవుతాయన్నారు. ఆలయనిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ దేవస్థానం కమిటీ చైర్మెన్ కాపగంటి ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు

చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్టు



వేర్వేరు కేసులకు సంబంధించి పట్టుకున్న ఇద్దరు దొంగలతో కోరంగి పోలీసులు

తాళ్లరేవు: ఇటీవల వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను సోమవారం అరెస్టు చేసినట్లు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారంఈ నెల 18వ తేదీన స్థానిక సంతపేట సెంటర్‌లో నూలు రాజేశ్వరి అనే వృద్ధురాలి ఇంటిలో అర్ధరాత్రి ప్రవేశించి ఆమె మెడలో గొలుసును అపహరించుకుపోయిన తాళ్లరేవు సంత మార్కెట్‌కు చెందిన పోతాబత్తుల యేసురాజు అలియాస్ ఏసును అరెస్టు చేసి అతని వద్ద నుంచి 2.5 కాసుల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అదేవిధంగా కోరంగి గ్రామదేవత ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో ఈ నెల 22వ తేదీ రాత్రి హుండీని దొంగలించిన పగడాలపేట గ్రామానికి చెందిన బొడ్డు అంజిబాబును అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరికి జిల్లాలోని పలు దొంగతనాలతో సంబంధం ఉండడంతో కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కేవలం ఒక్కరోజు వ్యవధిలోనే ముద్దాయిని పట్టుకుని నగదు రికవరీ చేశారన్నారు. అదేవిధంగా సఖినేటిపల్లి గ్రామంలో దొంగిలించిన గ్లామర్ మోటార్‌సైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

ఎన్నికల నిర్వ హణపై అవగాహన



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో మాధవి

అమలాపురం రూరల్: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పోలింగ్ సిబ్బంది ఎన్నికల నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పోలింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని రెవెన్యూ డివిజనల్ అధికారిని కె.మాధవి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ గోదావరి భవన్‌లో రెండో దశ శిక్షణ కార్యక్రమాన్ని మాస్టర్ ట్రైనింగ్, మండపేట తహసీల్దార్ తేజేశ్వరరావు అమలాపురం డివిజన్ పోలింగ్ సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించారు. ఈసీ మార్గదర్శకాల ప్రకారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, బ్యాలెట్ పత్రాలు దెబ్బతినకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బ్యాలెట్ బాక్సులను, మెటీరియల్‌ను పీఓ, ఏపీఓలు బ్యాలెట్, పోలీసు బందోబస్తు మధ్యన వాటిని తరలించాలని, పోలింగ్, సెక్టార్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీవోలు ఏపీవోలు ఇతర పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారికి నదీ జలాలతో అభిషేకం



నదీజలాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న మహిళలు

తాళ్లరేవు: జార్జీపేట గ్రామదేవత మహాలక్ష్మి అమ్మవారికి దేశంలోని ప్రముఖ పుణ్య నదీజలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సోమవారం ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. స్థానిక దుర్గా మల్లేశ్వర ఆలయం వద్ద నుంచి అధిక సంఖ్యలో మహిళలు నదీజలాలు, సుగంధ ద్రవ్యాలు, పుష్పోదకాలతో కూడిన కుంభాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకాలు చేశారు. అదేవిధంగా అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ మహాలక్ష్మి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు జాకెట్టుముక్క, గాజులను పంపిణీ చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

బీసీలపై అసభ్యకరంగా మాట్లాడిన ఆరుగురిపై ఫిర్యాదు

అమలాపురం టౌన్: బీసీ కులాలపై ముఖ్యంగా శెట్టిబలిజ కుల పెద్దలు, మహిళలపై అసభ్యకరంగా మాట్లాడిన గోదావరి జిల్లాలకు చెందిన ప్రస్తుతం గల్ఫ్ దేశాల్లో ఉంటున్న ఆరుగురి వ్యక్తులపై న్యూఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు అమలాపురానికి చెందిన సీనియర్ న్యాయవాది కుడుపూడి అశోక్ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆ ఆరుగురిపై చర్యలు తీసుకోవాలని అశోక్ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్న వ్యక్తులు పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరానికి చెందిన కొల్లబత్తుల శివ, క్రేజీ సురేష్, పాలకొల్లుకు చెందిన బొండ కుమార్ స్వామి, కోనసీమ జిల్లా అల్లవరానికి చెందిన కాశి శశికుమార్, కాట్రేనికోన మండలం పల్లంకుర్రుకు చెందిన శశి, కడప జిల్లా రైల్వే కోడూరుకు చెందిన వేటూరి శ్రీనివాసులపై చర్యలు తీసుకోవాలని న్యాయవాది కోరారు. కుల గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, వారిని సంఘద్రోహులుగా గుర్తించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. శెట్టిబలిజ కుల దైవంగా తాము భావించే దివంగత దొమ్మేటి వెంకటరెడ్డిపై శెట్టిబలిజ మహిళలపై, కల్లుగీత కార్మికులపై ఆ ఆరుగురు చాలా అసభ్యకరంగా మాట్లాడారని ఈ ఫిర్యాదులో అశోక్ ఈ ఫిర్యాదులో వివరించారు.

28న టైలర్స్ డేను విజయవంతం చేయాలి

అమలాపురం టౌన్: కుట్టు మెషీన్ సృష్టికర్త విలయమ్స్ హో జయంతి సందర్భంగా ఈనెల 28వ తేదీన నిర్వహించే టైలర్స్ డే వేడుకలకు పట్టణంలోని టైలర్స్ అంతా హాజరై విజయవంతం చేయాలని ది అమలాపురం టౌన్ టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పిశెట్టి మోహనరావు (చంద్ర టైలర్స్) పిలుపునిచ్చారు. టైలర్, అలనాటి లవకుశ సినిమాలోని కుశుడు పాత్రధారి వియ్యూరి నాగ సుబ్రహ్మణ్యం ఆ రోజు టైలర్స్ జెండా ఆవిష్కరణతో వేడుకలు మొదలవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పట్టణానికి చెందిన టైలర్ కొప్పిశెట్టి సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని పట్టణ టైలర్స్ అసోసియేషన్ తన వంతు ఆదుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. సంపాదించే వ్యక్తిని కోల్పోయిన దివంగత సుబ్రహ్మణ్యం కుటుంబానికి అసోసియేషన్ తరపున రూ.20 వేల ఆర్థిక సాయం అందించనున్నట్లు మోహనరావు తెలిపారు.

రాష్ట్ర అభ్యుదయ సేవా సంఘం చేనేత కన్వీనర్‌గా భాస్కరరావు

అమలాపురం రూరల్: రాష్ట్ర దేవాంగ అభ్యుదయ సేవా సంఘం చేనేత కన్వీనర్‌గా బండారులంక చెందిన కొండా భాస్కరరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కన్వీనర్ గుత్తి త్యాగరాజు నియామక పత్రం అందజేశారు. సమ సమాజసేవలో తమ వంతు పాత్ర పోషించాలని కోరారు.

డంపింగ్‌యార్డుకు స్థలం కేటాయించాలి

- ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకోవాలి
- ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆదేశాలు



ఆర్ఏఓ మునిస్వామితో సమావేశమైన ఎమ్మెల్యే అశోక్, చిత్రంలో ఎస్పీ రాజశేఖరన్

యానాం: యానాం పట్టణ పరిధిలో రోజువారీ వ్యర్థాలను వేయడానికి వీలుగా ప్రజలకు ఇబ్బందులు లేని విధంగా ప్రభుత్వం కొత్తగా డంపింగ్ యార్డుకు స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ కోరారు. సోమవారం స్థానిక ఆర్ఏఓ ఛాంబర్‌లో ఆర్ఏఓ మునిస్వామితో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం హెచ్ఆర్ స్క్వేర్ సంస్థ కనకాలపేట డంపింగ్ యార్డు వద్ద చెత్తను డంప్ చేయడం లేదని కావున తక్షణం ప్రభుత్వం స్పందించి కొత్తగా స్థలాన్ని కేటాయించాలన్నారు. స్థలాన్ని కేటాయించాలని ఇప్పటికే 8 నెలల సమయం ఇచ్చినా ప్రభుత్వ అధికారులు కాలయాపన చేయడం ఏమిటని ప్రశ్నించారు. స్థలం ఇవ్వమని అడిగితే ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ సెలవుపై వెళ్లడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అదేవిధంగా యానాం వేంకటేశ్వరస్వామివారి ఆభరణాలు గురించి పాత కమిటీ రెండు రోజుల క్రితం ప్రకటన విడుదల చేశారని ఆవిధంగా స్వామివారి ఆభరణాలను ప్రభుత్వానికి ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నట్టు తెలిపారని కాని ఇంత వరకు అధికారులు వాటి గురించి ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు. తక్షణం స్వామివారి ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాజశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.